క్లుప్తంగా

మునగపాకలో వాహన తనిఖీలు



మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు వెంట ఉంచుకోవాలని ఏఎస్‌ఐ మన్మథరావు సూచించారు. మునగపాకలో ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు హెల్మెట్ ధరించడంతో పాటు రికార్డుల నిర్వహణ చేసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ నేరమన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మునగపాక: మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరగనుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

కొనసాగుతున్న అయ్యప్ప స్వాములకు భిక్ష



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష స్వీకరిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భిక్ష సదుపాయం ఆదివారానికి 12వ రోజుకు చేరుకుంది. అయ్యప్ప, శివమాలలు ధరించిన భక్తుల సౌకర్యార్థం మునగపాకలోని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తుల సహకారంతో భిక్ష సదుపాయాన్ని ప్రారంభించడం తెలిసిందే. ఈ మార్గంలో రాకపోకలు సాగించే భక్తులు భిక్షను వినియోగించుకుంటున్నారు. 40 రోజుల పాటు భిక్ష సదుపాయం అందించేందుకు చర్యలు తీసుకున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

భగవద్గీత శ్లోకాలపై అవగాహన అవసరం



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న బోధకురాలు రామలక్ష్మి

మునగపాక: ప్రతి విద్యార్థికి భగవద్గీత శ్లోకాలపై అవగాహన అవసరమని భగవద్గీత బోధకురాలు భీశెట్టి రామలక్ష్మి అన్నారు. మండలంలోని మంగళవరపుపేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించేలా ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. గ్రంథాలయ డైరెక్టర్లు తులసీ, సునీత, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెదురువాడ రామాలయం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రామాలయం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ భూమి పూజ చేశారు. ముందుగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఆటంకాలు..!

సగానికి పైగా తుప్పలు.. నెలల తరబడి బురదమయంగా అవుట్ ఫీల్డ్..పెవిలియన్లు.. చీకటి పడితే చాలు మందుబాబులకు అడ్డా.. కొద్దిపాటి వర్షానికే చెరువులా మారుతున్న మైదానం.. ఇది యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానం దుస్థితి. హాకీతో పాటు పలు క్రీడలకు పేరొందిన యలమంచిలి పట్టణంలో క్రీడాకారుల సాధనకు ముఖ్యమైన మైదానం అధ్వానంగా తయారైంది. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని తరచూ అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రసంగాలు కేవలం మాటలకే పరిమితం అవుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



గోల్ పోస్ట్ వద్ద పరిస్థితి



బురదమయంగా మారిన పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానం

- కొద్దిపాటి వర్షానికే మునుగుతున్న రాజీవ్ క్రీడా మైదానం
- నెలల తరబడి అధ్వానంగా అవుట్ ఫీల్డ్, పెవిలియన్లు
- వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వాకర్ల వినతి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానం సగానికి పైగా బురద, తుప్పలతో నిండిపోయింది. కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు మైదానం చెరువును తలపిస్తోంది. మైదానంలో చేరిన వర్షపునీరు బయటకు పోయే మార్గం లేక నెలల తరబడి బురదమయంగా దర్శనమిస్తోంది. వర్షపు నీరు అలాగే నిలిచిపోయి అవుట్ ఫీల్డ్, పెవిలియన్లు బురదమయంగా ఉంటున్నాయి. పొద్దుపోతే మందుబాబులకు అడ్డాగా మైదానం ఉంటోంది. దీంతో క్రీడాకారులు రోజూ సాధన చేయడానికి వీలుపడటంలేదు. 60 శాతం మైదానం క్రీడా సాధనకు అనుకూలంగా ఉండటం లేదు. క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్ క్రీడలు ఆడటానికి ఈ మైదానం ఏమాత్రం చాలడంలేదు. తుప్పలు మొలిచి, బురదమయంగా మారిన మైదానాన్ని అభివృద్ధి చేస్తే తప్ప పూర్తిస్థాయిలో క్రీడల సాధనకు కుదరదని క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు.

20 ఏళ్లుగా మైదానం అభివృద్ధి గాలికి..

దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2004 ఆగస్టు 29న రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. ఆ సమయంలో అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నబాబురాజు మైదానం అభివృద్ధి కోసం విన్నవించారు. దీనికి వైఎస్సార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రూ.25 లక్షలతో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశారు. ఈ మైదానం వేదికగా పలువురు క్రీడాకారులు వివిధ క్రీడల్లో సాధన చేసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి సత్తా చాటారు. ఆ తర్వాత మైదానం అభివృద్ధి, నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో అధ్వానంగా మారింది. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా మైదానం అభివృద్ధితో పాటు సరైన వాకింగ్ ట్రాక్ నిర్మించాలని వాకర్లు, క్రీడాకారులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కోర్టుల నిర్వహణ

స్థానికంగా ఉన్న కోర్టు భవనాలు శిథిలం కావడంతో 10 ఏళ్ల క్రితం మైదానంలో క్రీడాకారుల అవసరాల కోసం నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కోర్టుల నిర్వహణకు అప్పగించారు. అప్పట్లో తాత్కాలికంగా కోర్టుల నిర్వహణ చేపడుతున్నామని, కోర్టు కొత్త భవనాల నిర్మాణం పూర్తయిన వెంటనే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను తిరిగి అప్పగిస్తామని చెప్పి పదేళ్లు దాటిపోయింది. ఇప్పటికీ కోర్టు భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోనే మరికొన్ని సంవత్సరాలు కోర్టుల నిర్వహణ కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. క్రీడాకారుల అవసరాల కోసం నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ గదుల్లో రెండు కోర్టుల కార్యకలాపాలు జరుగుతున్నాయి. దీంతో క్రీడాకారులు, ముఖ్యంగా బాలికలు, మహిళా పీఈటీలు టాయిలెట్ల కోసం, దుస్తులు మార్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మైదానంలో వ్యర్థాలు

మైదానాన్ని అభివృద్ధి చేయాలి



ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రాజీవ్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి. పట్టణంలో ఉన్న ఏకైక క్రీడా మైదానం ప్రస్తుత పరిస్థితి బాధ కలిగిస్తోంది. అందరికీ ఉపయోగపడే మైదానా న్ని పరిశీలించి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని క్రీడాకారులు, స్థానికుల అవసరాలకు తగిన విధంగా ప్రణాళిక రూపొందించి అభివృద్ధి చేయాలి.

–యల్లపు శ్రీనివాసరావు, సోమలింగపాలెం, యలమంచిలి

క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు



క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి. 20 ఏళ్లుగా మైదానం అభివృద్ధిని పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఉన్న ఒకే ఒక్క మైదానంపై నిర్లక్ష్యం చూపడం భావ్యం కాదు. క్రీడాకారులు, విద్యార్థులు సాధన చేయడానికి మైదానం అధ్వానంగా ఉంది. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలంటే ఆట స్థలాలు ఉండాలి. ఇందు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

–చింతకాయల శివాజీ, సీఐటీయూ నాయకుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



క్రీడా మైదానం పరిస్థితిని పాలకవర్గం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రజాప్రతినిధుల సహకారంతో వీలైనంత వరకు అత్యవసర సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం. క్రీడాకారులు సాధన చేయడానికి మైదానం అనుకూలంగా ఉంటే అందరికీ ఉపయోగపడుతుంది. చుట్టూ కాలువలు నిర్మిస్తే వర్షపునీరు నిలిచిపోకుండా ఉంటుంది. మైదానం అభివృద్ధికి అందరి సహకారం అవసరం.

–టీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్న కమిటీ సభ్యులు

పాయకరావుపేట: ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం వారోత్సవాల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14న బాలల దినోత్సవం నిర్వహించి చిన్నారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలుంటాయన్నారు. మిగతా రోజుల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌గా విభజించి పలు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పుస్తక ప్రదర్శన, డిపాజిట్లు సేకరించడం, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కవి సమ్మేళనం, వంటి పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20న ముగింపు రోజున విజేతలకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎస్‌వీఎస్ ఆచార్యులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు నాగం సీతారామమూర్తి, చల్లపల్లి సత్యనారాయణ, అచ్యుతరావు, తేజోమూర్తుల వెంకటేశ్వరావు, ధనిశెట్టి తులసి, కేసనకుర్తి సత్తిబాబు, పాఠకులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ నేడు

కోటవురట్ల: సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ శిక్షణ ప్రారంభమవుతుందని, విధిగా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు హాజరు కావాలని సూచించారు.

పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఆదివారం బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన కంపెనీల్లో వేలాది మంది ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. పూడిమడక రోడ్డులో అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్నాయన్నారు. అతివేగంతో వాహనాలను నడపడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఒకవైపు ఆర్‌అండ్‌బీ అధికారులు భారీ వాహనాల రాకపోకలు తగవంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వాహనాల రాకపోకలు ఆగడం లేదన్నారు. ఆర్‌టీవో, పోలీసు అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేలా చూడాలన్నారు. గతంలో పూడిమడక రోడ్డును మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.6.8 కోట్లతో అభివృద్ధి చేశారని, ప్రస్తుతం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు దెబ్బతింటుందన్నారు. సమస్య పరిష్కారం కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశీబాబు, టెక్కలి కొండలరావు, మొల్లేటి నారాయణరావు, కోనపల్లి రామ్మోహనరావు, ఇల్లా నాగేశ్వరరావు, పెదబ్బాయి, కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

మంచు ముసుగు



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో కమ్ముకున్న పొగమంచు

మంచు సొగసులు మైదానంలోనూ కనువిందు చేస్తున్నాయి. మన్యానికి ఏమాత్రం తీసిపోమంటూ మైదానం ప్రాంతం కూడా మంచు ముసుగేసుకుంటోంది. మండలంలోని పల్లెల్లో ఆదివారం పొగమంచు కమ్మేసింది. రహదారులు, పంట పొలాలను పొగమంచు కమ్ముకుని లంబసింగిని తలపిస్తోంది. రహదారులను దట్టంగా కమ్మేయడంతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. రహదారుల్లో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. –కోటవురట్ల

అభిజిత్ కంపెనీ లేఆఫ్‌ను ఎత్తివేయాలి



అభిజిత్ కార్మికులతో సమావేశమైన సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం: స్థానిక సెజ్‌లోని అభిజిత్ పరిశ్రమ ప్రకటించిన లే ఆఫ్‌ను తక్షణమే ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అచ్యుతాపురం, కొండకర్ల, ఎర్రవరం, హరిపాలెం, తిమ్మరాజుపేట, చోడపల్లి, మోసయ్యపేట గ్రామాల్లో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభిజిత్‌లో కార్యకలాపాలను ప్రారంభించి కార్మికులను విధుల్లోకి తీసుకుని బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం అభిజిత్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి కర్మాగారాన్ని తెరిపించాలన్నారు.

ఘనంగా కాశీ అన్నపూర్ణేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం



నాగులాపల్లిలో అన్నసమారాధనకు హాజరైన భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం కాశీ అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి



అడ్డురోడ్డులో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు సూచించారు. అడ్డురోడ్డులో ఆదివారం ఓ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన పార్టీ మండల నాయకులతో సమావేశమయ్యారు. అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం అన్నీ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ ఎవరికి ఇచ్చేది స్పష్టత లేదన్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులందరూ గ్యాస్ బుక్ చేసుకుని రాయితీ నగదు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అర్హులై ఉండి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా తలుపులు తెరవలేదని ఆయన విమర్శించారు. ఇక సంక్షేమ పథకాలు ఊసే లేదని చెప్పారు. గడిచిన ఐదు నెలల్లో చంద్రబాబు పరిపాలన చూసి జనం విసిగిపోయారన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు, ఎక్కడ నుంచి అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీపతిరాజు, వెలగా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, గుడివాడ, వాకపాడు, పెదఉప్పలం సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, మైలపల్లి శ్రీనివాసరావు, కోశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆగని గ్రావెల్ దందా!



చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో అక్రమ తవ్వకాలతో తరిగిపోతున్న కొండ

కోటవురట్ల: గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడలేదు. మండలంలో చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో నాలుగు నెలలుగా కొండలపై అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్నా అడ్డుకునే నాథుడే కనిపించడంలేదు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిపోతోంది. అనుమతి లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నా అధికారులు నోరుమెదపకపోవడంలో మర్మమేంటో అర్థం కావడంలేదు. పచ్చని కొండలు తరిగిపోతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరణం కొత్తూరుకు చెందిన ఓ టీడీపీ కార్యకర్త జంకూ బొంకూ లేకుండా గ్రావెల్‌ను అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. తన సొంత పొక్లయిన్‌ను ఉపయోగించి కొండలను పిండి చేసి తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. చినబొడ్డేపల్లి, కరణం కొత్తూరు, మల్లవరం వెళ్లే రహదారుల్లో కొండలపై అక్రమ తవ్వకాలు నిత్యకృత్యంగా జరుగుతున్నాయి. నాలుగు నెలల్లో సుమారు రూ.20 లక్షల విలువైన గ్రావెల్ ఇక్కడి నుంచి అక్రమంగా తరలిపోయింది. ఇంత జరుగుతున్నా మైనింగ్ శాఖాధికారులు, రెవెన్యూ అధికారుల దాడులు లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండలను తవ్వేసి గ్రావెల్ తరలించుకుపోయిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయిని స్వర్ణగౌరికి సత్కారం



అవార్డు గ్రహీత స్వర్ణగౌరిని సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: రేవుపోలవరం ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయిని పి.స్వర్ణగౌరికి ఇన్నర్ వీల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ టీచింగ్ మ్యాథమెటిక్స్ అవార్డు ప్రదానం చేసి, సత్కరించారు. అనకాపల్లిలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఇన్నర్‌వీల్ లిటరసీ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించినట్టు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకుడు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో పని చేసే ఉపాధ్యాయినికి ఈ అవార్డు రావడంపై స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీశ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకుడు వీరభద్రరావు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



కె.కోటపాడులో గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ గవర వీధి వాసులు శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉత్సవాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా ఉత్సవ మూర్తుల విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి అబిద్‌సెంటర్ మీదుగా ఊరేగింపుగా గవరవీధి తరలించి, మండపంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్తీక మాసం నెల రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం సారె చీరతో అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. విగ్రహాల ఊరేగింపులో మహిళలు పాల్గొన్నారు.

కె.కోటపాడులో గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో గల గౌరీ పరమేశ్వరుల విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల ఆలయంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. నాగుల చవితి పర్వదినం రోజున గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని జరపనున్నారు. గౌరీపరమేశ్వరులకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజలు జరిపారు.

త్వరలో శారదా నది ఘాట్ సుందరీకరణ



శారదా ఘాట్ వద్ద చెత్తను తొలగిస్తున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

తుమ్మపాల: శారదా నది ఘాట్‌ను త్వరలో సుందరీకరిస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఘాట్ వద్ద గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జలసంరక్షణ పట్ల అందరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఘాట్‌ను ఆధునికీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. బోటింగ్, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, క్లబ్ నిర్వాహకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నదిలో పారవేయొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, యల్లపు సూరి అప్పారావు, బేతాళం శేషసాయి, ఏఎంఏఎల్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట: పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలోని 11 కేవీ రాజుగారిబీడు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేతలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజుగారిబీడు, బీడీవో లేఅవుట్, పీఎస్ఆర్ నగర్, కరణంగారి వీధి, కుమ్మరి వీధి, పెదపీర్ల పంజా, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.